

ఆదివారం మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణంలో బీఆర్ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డి ప్రచారానికి మద్దతుగా మంత్రి కే తారకరామారావు నిర్వహించిన రోడ్‌షోకు పెద్ద సంఖ్యలో హాజరైన ప్రజలు

# బీఆర్ఎస్సే శ్రీరామరక్ష

## 29న ఘనంగా దీక్షా దివస్ నిర్వహిద్దాం

## 50 ఏండ్ల కాంగ్రెస్ దాష్టీకాలను గుర్తుచేసుకుంటూ కార్యక్రమాలు చేద్దాం

**అమరుల త్యాగాలను స్మరించుకొందాం**

**రైతుబంధు ఇస్తే రేవంత్‌కు నొప్పెందుకు?**

**ఎన్నికలకు ముందే కాంగ్రెస్ అస్త్రసన్యాసం**

- బీజేపీ, కాంగ్రెస్ కుమ్మక్కు రాజకీయాలు
- రేవంత్ ఒక్కసారన్నా మోదీని ప్రశ్నించారా?
- రాష్ట్రంలో బీజేపీని అన్ని చోట్లా ఓడిస్తాం
- అమేథిలో గెలువని రాహుల్ ఈడ ఏంచేస్తడు?
- పదేండ్లలో తెలంగాణ సర్కారుతో సమానంగా ఉద్యోగాలిచ్చిన రాష్ట్రం ఏదైనా ఉన్నదా?
- రాహుల్‌కు దమ్ముంటే సమాధానం చెప్పాలి?
- మీడియా సమావేశంలో మంత్రి కే తారకరామారావు

హైదరాబాద్, నవంబర్ 26 (నమస్తే తెలంగాణ): ప్రొఫెసర్ జయశంకర్ సార్ చెప్పినట్టుగా తెలంగాణకు ఏనాటికైనా స్వీయ రాజకీయ అస్థిత్వమే శ్రీరామ రక్ష అని, ఎన్నటికైనా తెలంగాణకంటూ ఉన్న రాజకీయ గొంతుక బీఆర్ఎస్ మాత్రమేనని మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. నాడు జయశంకర్‌సార్ చెప్పిన మాట మేరకు తెలంగాణ ప్రయోజనాల కోసం సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ కట్టుబడి ఉన్నదని స్పష్టం చేశారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో మంత్రి కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. 50 ఏండ్ల కాంగ్రెస్ అరాచకాలు, మోసాలను గుర్తు చేసుకుంటూ 29న 'దీక్షా దివస్'ను దేశ, విదేశాల్లో, తెలంగాణవ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని శ్రేణులు, ఉద్యోగ సంఘాలు, సకలజనులకు పిలుపునిచ్చారు. నవంబర్ 29.. దేశ రాజకీయాల్లో అద్భుతమైన ఘట్టానికి బీజంపడిన రోజు అని చెప్పారు. 75 ఏండ్ల భారత రాజకీయాల్లో ఎన్నో పార్టీలు వచ్చి వెళ్లినా.. ఒక లక్ష్యం కోసం, ఒక స్పష్టమైన అజెండాతో పార్టీని పెట్టడం గొప్ప విషయమని పేర్కొన్నారు. 'ఉద్యమం నుంచి నేను తప్పుకొంటే.. తెలంగాణను నేను తేలేకపోతే.. రాళ్లతో కొట్టి చంపండి' అని చెప్పినా.. 'నేను ఆంధ్రప్రదేశ్ నుంచి బయలుదేరి వెళ్తున్నాను. తిరిగి తెలంగాణలోనే కాలు పెడతాను' అని ఒక శపథం చేసినా.. 'కేసీఆర్ చచ్చుడో.. తెలంగాణ వచ్చుడో..' 'అయితే నా శవయాత్ర లేకపోతే తెలంగాణ జైత్రయాత్ర' అని నినదించినా అది కేసీఆర్‌కే చెల్లిందని పేర్కొన్నారు.

### చావునోట్లో తలపెట్టి తెలంగాణ సాధించారు

చావునోట్లో తలపెట్టి తెలంగాణ సాధించిన నాయకుడు కేసీఆర్ అని కేటీఆర్ పేర్కొన్నారు. 15 ఏండ్ల క్రితం నవంబర్ 29న కరీంనగర్‌లో బయలుదేరి అలుగునూరు చౌరస్తా నుంచి ఖమ్మం జైలుకు పోయేదాకా.. అక్కడినుంచి నిమ్స్ దవాఖానకు వచ్చేదాకా జరిగిన ఘట్టాలెన్నో అందరికీ గుర్తున్నాయని తెలిపారు. కేసీఆర్ ఆరోగ్యం క్షీణించినా, ప్రాణాలకే ప్రమాదమని తెలిసినా, ఎందరో బతిమిలాడినా, ఆత్మ గౌరవ విశ్వరూపం చూపించి, ఆ పట్టుదల లోంచి పార్లమెంట్‌లో ప్రకంపనలు పుట్టించిన ధీరత్వం కేసీఆర్‌దని గుర్తు చేశారు. 14 ఏండ్లుగా 29 నవంబర్‌న కేసీఆర్ చేపట్టిన ఆమరణ దీక్షకు గుర్తుగా, తెలంగాణ సమాజాన్ని కార్యోన్ముఖులను చేసిన కేసీఆర్ పోరాట స్ఫూర్తికి ప్రతీకగా, తన జాతి విముక్తికి చిహ్నంగా 'దీక్షా దివస్'ను జరుపుకుంటున్నామని కేటీఆర్ వివరించారు. ఈ నవంబర్ 29తో 15వ ఏటకు చేరుకొన్నదని, ఈ ఏడాది కూడా దీక్షా దివస్‌ను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు.

### జనవరిలో గల్ఫ్ పాలసీ

తెలంగాణ నుంచి ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లినవారికోసం ప్రత్యేకంగా గల్ఫ్ పాలసీని తీసుకొస్తామని, రైతు బీమా తరహాలోనే గల్ఫ్‌కు వెళ్లిన కార్మికులకు గల్ఫ్ బీమాను అమలుచేస్తామని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే జనవరిలో గల్ఫ్ పాలసీని అమలుచేస్తామని సిరిసిల్ల రోడ్ షోలో ప్రకటించారు. గల్ఫ్ పాలసీ కింద వివిధ సంక్షేమ కార్యక్రమాలను కూడా తీసుకొని వస్తామని చెప్పారు.



### బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటయ్యాయి

తెలంగాణలో బీజేపీ, కాంగ్రెస్ కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయని కేటీఆర్ మండిపడ్డారు. మోదీని ప్రశ్నించే దమ్ము రేవంత్‌కు లేదని, ఎందుకంటే ఆయనది ఏబీవీపీ, ఆర్ఎస్సెస్ బ్యాగ్రౌండ్ అని విమర్శించారు. బీజేపీతో లోపాయికారి ఒప్పందం ఉన్నదని తెలిపారు. 'రేవంత్‌కు నిజంగానే బీజేపీపై పోరాడాలని ఉంటే గోషామహల్, కరీంనగర్, కోరుట్లలో డమ్మీ అభ్యర్థులను ఎందుకు పెట్టిండు? ఎవరికోసం? రాజాసింగ్, బండిసంజయ్, ధర్మపురి అర్వింద్‌ను గెలిపించుకోవాలనే తాపత్రయం ఎందుకు? నేను చెబుతున్నా.. ఈసారి రాజాసింగ్, బండి సంజయ్, అర్వింద్‌ను ఓడిస్తాం. ఈ దేశంలో బీజేపీని నిలువరించే సత్తా బీఆర్ఎస్‌వంటి ప్రాంతీయ పార్టీలకే ఉన్నది. కాంగ్రెస్‌కు ఆ సత్తా లేదు. ఎన్నికలకు ముందే కాంగ్రెస్ అస్త్రసన్యాసం చేసింది' అని అన్నారు. కేంద్రంలోని బీజేపీ పీఎం కిసాన్ వేస్తే రేవంత్‌కు కనిపించదా? చీమకుట్టినట్టు కూడా ఉండదా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ సర్కారు రైతుబంధు ఇస్తుంటే రేవంత్‌కు వచ్చిన నొప్పేంటి? అని మండిపడ్డారు.

### కాంగ్రెస్సా? కరెంటా? ప్రజలే తేల్చుకోవాలి

రేవంత్, కర్ణాటక డిప్యూటీ సీఎం చేస్తున్న ప్రకటనలతో కరెంటుపై కాంగ్రెస్ వైఖరి స్పష్టమైందని కేటీఆర్ తెలిపారు. రేవంత్ 3 గంటల కరెంటే అంటున్నారని, డీకే శివకుమార్ 5 గంటలు అంటున్నారని.. తాము 24 గంటలు అంటున్నామని చెప్పారు. కాంగ్రెస్ ఉంటే కరెంటు ఉండదని స్పష్టం చేశారు. 3,5 గంటల కాంగ్రెస్ కావాల్నా? 24 గంటలకరెంటు కావాల్నా? ప్రజలే తేల్చుకోవాలని సూచించారు. కాంగ్రెస్‌ను నమ్మి తాము మోసపోయామని, తెలంగాణ ప్రజలు మోసపోవద్దని అక్కడి రైతులు ఇక్కడికొచ్చి మరీ చెప్తున్నారని అన్నారు. అలాంటప్పుడు కర్ణాటక నేతలను ఇక్కడెవరు నమ్ముతారని, పత్రికా ప్రకటనలు కాదు.. వాళ్లు ఇక్కడ బట్టలు చింపుకున్నా పట్టించుకునేవారే ఉండబోరని ఎద్దేవా చేశారు. హైదరాబాద్ పేరు మారుస్తానంటున్న యూపీ సీఎం యోగీ.. తన పేరే మార్చుకున్నారని, ఆయన ఇలాంటి అంశాలపై కాకుండా ఉత్తర ప్రదేశ్ అభివృద్ధిపై దృష్టిపెడితే ఇంకా బాగుంటుందని ఎద్దేవా చేశారు.

### కాంగ్రెస్ నేతలే రాజకీయ నిరుద్యోగులు

తెలంగాణ నిరుద్యోగం చాలా తక్కువగా ఉన్నదని, ఇక్కడ నిరుద్యోగం ఉన్నదని చెప్తున్న కాంగ్రెస్ నేతలే రాజకీయ నిరుద్యోగులు అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. 2014 నుంచి రాహుల్‌గాంధీ రాజకీయ నిరుద్యోగిగానే ఉన్నారని చురకలంటించారు. 'రాహుల్ గాంధీకి దమ్ము, ధైర్యం ఉంటే నా ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలి. పదేండ్లలో తెలంగాణతోపాటు ఏ రాష్ట్రమైనా అధికంగా ఉద్యోగాలు ఇచ్చిందా? ఉంటే చూపించాలి. మేము పదేండ్లలో లక్షా 60 వేల పైచిలుకు ఉద్యోగాలు ఇచ్చాం. ఇదే రాహుల్ గాంధీ ఏడాదిలోపు కర్ణాటకలో రెండున్నర లక్షల ఉద్యోగాలు ఇస్తామని, మొదటి క్యాబినెట్‌లో సంతకం పెడతామని చెప్పారు. వచ్చి ఆరు నెలలైంది.. ఒక్క ఉద్యోగానికి నోటిఫికేషన్ ఇచ్చారా? దమ్ముంటే చెప్పాలి. కర్ణాటక యువతను మోసం చేయలేదా? రాహుల్ తన జీవితంలో ఎన్నడైనా ఉద్యోగం చేసిండా? ఒక ప్రవేశ పరీక్ష రాసిండా? రేవంత్ ఏమైనా ఉద్యోగం చేసిండా? ఇలాంటి వాళ్లా వచ్చి మాట్లాడేది' అని సవాల్ విసిరారు. పుట్టకతోనే గోల్డెన్ స్పూన్‌తో పుట్టినోళ్లు నిరుద్యోగుల గురించి మాట్లాడితే ఎలా నమ్మాలి? అని ప్రశ్నించారు. రాజకీయ నిరుద్యోగులను నమ్మి మోసపోవద్దని యువతకు సూచించారు. తాము తప్పులు సవరించుకుంటామని, టీఎస్పీస్సీని ప్రక్షాళన చేస్తామని స్పష్టం చేశారు. డిసెంబర్ 4న అధికారులతో కలిసి స్వయంగా అశోక్‌నగర్ వస్తామని, ఉద్యోగార్థులతో కూర్చుంటామని, అందరి సమక్షంలో జాబ్ క్యాలెండర్ తయారు చేసే బాధ్యత తీసుకుంటానని చెప్పారు. ఏప్రిల్ 1న జ్యాబ్ క్యాలెండర్ అంటూ నిరుద్యోగులను ఫూల్స్‌ను చేసేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నదని, అది రాహుల్ పప్పు దినోత్సవమని, పార్లమెంట్ నోటిఫికేషన్ సమయంలో జాబ్ క్యాలెండర్ ఇస్తానని చెప్పడం ఆయన అజ్ఞానానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు.

### దొంగే దొంగ అన్నట్టుగా రాహుల్ తీరు

కేసీఆర్, ఓవైసీ ఒక్కటేనని రాహుల్ గాంధీ అంటున్నారనే ప్రశ్నకు సమాధానం ఇస్తూ.. రాహుల్‌గాంధీ తీరు దొంగే దొంగా దొంగా అని అరిచినట్టుగా ఉన్నదని కేటీఆర్ చురకలంటించారు. రాహుల్‌గాంధీ, మోదీ ఒక్కటేనని, వీరిద్దరూ కలిసే దొంగనాటకం ఆడుతున్నారని మండిపడ్డారు. యూపీలోని సొంత నియోజకవర్గం అమేధిలో ఓడిపోయిన రాహుల్‌గాంధీ తెలంగాణలో ఏంచేస్తారని ప్రశ్నించారు. బెంగాల్, ఢిల్లీలో, తమిళనాడు, తెలంగాణలో ప్రజలు బీజేపీని తరిమికొట్టారని చెప్పారు. ఇప్పటికీ బీజేపీని ఎదుర్కొనే దమ్ము కాంగ్రెస్‌కు లేదని అన్నారు. మోదీ, అమిత్‌షా, యోగిలాంటివారు ఎంతమంది వచ్చి ఏం చెప్పినా.. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రాబోదని చెప్పారు. ఉమ్మడి పౌరస్మృతిపై తమ వైఖరి ఇప్పటికే చెప్పామని, దానికే కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు.

> *తెలంగాణవ్యాప్తంగా ఉన్నవారికి నా విజ్ఞప్తి.. దీక్షా దివస్‌ను ఘనంగా, చైతన్యవంతం చేసేలా నిర్వహించాలి. 50 ఏండ్లపాటు జరిగిన దాష్టీకాలను గుర్తు చేసుకుంటూ, సిటీకాలేజీ దగ్గర అమరులైన విద్యార్థులను తలచుకొంటూ, 1956లో మన ఇష్టంలేకుండానే ఆంధ్రా కలిపిన దారుణాన్ని తలుచుకొంటూ కార్యక్రమాన్ని నిర్వహిద్దాం. 1968లో 371 మందిని కాల్చి చంపిన వారి క్రూరత్వాన్ని బయటపెడుతూ.. మన బిడ్డల ఆత్మ బలిదానాలకు అర్థంలేకుండా చేసిన వారి కుటిలత్వాన్ని మననం చేసుకుంటూ కార్యక్రమాలు చేద్దాం. 2004 నుంచి 2014 వరకు వందల మంది తెలంగాణ బిడ్డల బలిదానాలకు కారణమైన వారిని గుర్తుపెట్టుకొని దీక్షా దివస్‌ను నిర్వహిద్దాం.*
>
> -మంత్రి కేటీఆర్



నర్సాపూర్‌లో మంత్రి కేటీఆర్ స్పీచ్‌ను బస్సుపై నిలబడి వింటున్న యువకులు

# కాంగ్రెస్‌తో పాతరోజులే

- కరెంటు కోతలు.. ఎరువుల గోసలు
- 11 చాన్సులు ఇస్తే ఏం చేసిందని ఇప్పుడు మళ్లో చాన్స్ అడుగుతున్నది?
- రేవంత్‌రెడ్డి రెండు చోట్లా ఓడిపోతారు
- సిరిసిల్ల నాకు రాజకీయ జన్మనిచ్చింది
- వచ్చేది మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే
- చొప్పదండి, సిరిసిల్ల, నర్సాపూర్ రోడ్‌షోల్లో మంత్రి కే తారకరామారావు

కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, నవంబర్ 26 (నమస్తే తెలంగాణ)/నర్సాపూర్: కాంగ్రెస్‌కు ఓటేస్తే మళ్లీ కరెంటు కోతలు, ఎరువుల గోసలు తప్పవని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కే తారకరామారావు అన్నారు. ఇప్పటికే ప్రజలు ఆ పార్టీకి 11 చాన్సులిస్తే ఏమీ చేయలేదని, ఆ పార్టీ నేతలు ఇప్పుడొచ్చి ఒక్క చాన్స్ అని అడుగుతున్నారని మండిపడ్డారు. ఆదివారం చొప్పదండి, సిరిసిల్ల నియోజకవర్గంలోని వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట సహా నర్సాపూర్‌లో నిర్వహించిన రోడ్‌షోల్లో మంత్రి కేటీఆర్ పాల్గొన్నారు. రోడ్‌షోల్లో కేటీఆర్‌కు ప్రజలు బతుకమ్మలు, బోనాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఎవుసమే తెలియని రేవంత్‌రెడ్డి.. రైతులకు 3 గంటల కరెంట్ చాలని అంటున్నడు. 10 హెచ్‌పీ మోటర్ పెట్టుకోవాలని చెప్తున్నడు. ఇలాంటివాళ్లకు ఓటేస్తే మళ్లీ పాత రోజులే వస్తయ్. కర్ణాటకలో అక్కడి రైతుల పరిస్థితి దారుణంగా ఉన్నది. నాడు కాంగ్రెస్ పాలనలో కరెంటు, ఎరువులు ఇవ్వనోడు ఇప్పుడు ఇస్తానంటే నమ్మేదెట్ల? డౌటే లేదు. వచ్చేది మన ప్రభుత్వమే. మూడోసారి కేసీఆర్ సీఎం అవటం పక్కా' అని స్పష్టం చేశారు. కొడంగల్, కామారెడ్డిలో పోటీ చేస్తున్న రేవంత్‌రెడ్డి రెండు చోట్లా ఓడిపోవటం ఖాయమని తేల్చిచెప్పారు.


### రైతులు, కౌలురైతుల మధ్య కాంగ్రెస్ చిచ్చు

రైతులు, కౌలురైతుల మధ్య కాంగ్రెస్ పార్టీ చిచ్చు పెడుతున్నదని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుబంధు కౌలుదారుకిస్తే, పంట యజమానికి ఇవ్వాలంటూ రేవంత్ చెప్పటంపై మండిపడ్డారు. 3 గంటల కరెంట్ చాలని రేవంత్, తెలంగాణలో కరెంటే లేదని కోమటిరెడ్డి, రైతుబంధు దుబారా అని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతున్నారని, దీన్ని రైతులు సమర్థిస్తారా? అని ప్రశ్నించారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో రైతులకు 24 గంటల ఉచిత కరెంటు, సాగు, తాగు నీళ్లు ఇచ్చామని వివరించారు. మూడోసారి గెలిచాక 'కేసీఆర్ భరోసా' అమలు చేస్తామని, జనవరిలో కొత్త రేషన్‌కార్డులు ఇస్తామని వెల్లడించారు. కరెంట్ ఉంటే కాంగ్రెస్ ఉండదని, కాంగ్రెస్ ఉంటే కరెంట్ ఉండదని గుర్తుంచుకోవాలని ప్రజలకు సూచించారు.

### సిరిసిల్లను మరింత అభివృద్ధి చేస్తా

'నేను నిధులన్నీ సిరిసిల్లకే పెడుతున్నానని కాంగ్రెస్ నేతలు అంటున్నరు. ఇక్కడి కాంగ్రెసోళ్లు మాత్రం ఏమీ అభివృద్ధి జరగలేదంటున్నరు. కాంగ్రెసోళ్లకే క్లారిటీ లేదు' అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. సిరిసిల్లను జిల్లా చేసి కళాశాలలు, వర్సిటీలు ఏర్పాటు చేశానని చెప్పారు. ప్రతి మండలంలో కార్పొరేట్‌కు దీటుగా పాఠశాలల భవనాలు నిర్మించి నాణ్యమైన విద్య నందిస్తామని తెలిపారు. యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. గల్ఫ్ బాధితుల కోసం ప్రత్యేక ప్యాకేజీ, గల్ఫ్‌లో చనిపోయిన వ్యక్తి కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున సహాయం అందిస్తామని వెల్లడించారు. గోదావరి నీళ్లు తెచ్చి నియోజకవర్గ ప్రజల కాళ్లు కడుగుతానని చెప్పారు. భారీ మెజార్టీతో తనను గెలిపిస్తారన్న నమ్మకం తనకు ఉన్నదని కేటీఆర్ పేర్కొన్నారు. కార్యక్రమాల్లో చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మార్పు వద్దు.. కేసీఆరే ముద్దు



ఆదివారం హైదరాబాద్‌లో మంత్రి కేటీఆర్‌ను సత్కరిస్తున్న కోటిరెడ్డి, ఆంధ్రాసెటిలర్లు

- హైదరాబాద్ సెటిలర్ల స్పష్టీకరణ
- మంత్రి కేటీఆర్‌కు ఘన సన్మానం

హైదరాబాద్, నవంబర్ 26 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ పార్టీకే తమ సంపూర్ణ మద్దతు అని హైదరాబాద్‌లో స్థిరపడిన పలువురు ఆంధ్రాప్రాంత సెటిలర్లు స్పష్టంచేశారు. అధికార మార్పు వద్దు.. కేసీఆర్‌కే ముద్దు అని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో పదేండ్లుగా తెలంగాణలో తాగునీరు, కరెంటు సమస్యలు లేవని, శాంతిభద్రతలు చాలా బాగున్నాయని ఆనందం వ్యక్తంచేశారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత స్థిరాస్తుల విలువ భారీగా పెరిగి చాలా మంది కోటీశ్వరులు అయ్యారని, అందరూ హాయిగా, ఆనందంగా జీవనం సాగిస్తున్నారని పేర్కొన్నారు. దగ్గుమాటి కోటిరెడ్డి నేతృత్వంలో పలువురు సెటిలర్లు హైదరాబాద్‌లో ఆదివారం మంత్రి కేటీఆర్‌ను సత్కరించారు. సెటిలర్ల మద్దతు బీఆర్ఎస్‌కే అని ప్రకటించారు. తెలంగాణ ప్రజలు అందరినీ ప్రేమించే గొప్ప మనసు ఉన్నవారని, ఇలాంటి పరిస్థితుల్లో ఇక్కడ కొందరు కులతత్వాన్ని పెంచేందుకు ప్రయత్నిస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రస్తుత శాంతియుత వాతావరణానికి భంగం వాటిల్లకుండా హైదరాబాద్‌లో సుఖశాంతులతో జీవిస్తున్న సెటిలర్లందరూ బీఆర్ఎస్‌కే మద్దతు తెలపాలని విజ్ఞప్తిచేశారు.



మెదక్ జిల్లా నర్సాపూర్‌లో మంత్రి కేటీఆర్ నిర్వహించిన రోడ్‌షోకు ప్రజలు పోటెత్తారు. బస్సులు, బంగ్లాపై ఎక్కి కేటీఆర్ స్పీచ్ విన్నారు. జై తెలంగాణ నినాదాలతో హోరెత్తించారు.